# పుంలింగాలు

ఎవరికైనా బూతు పురాణం వినాలని కుతూహలం ఉంటే ఈ కథ సొంతంగా చదివినా సరే, లేదా సాయంకాలం పూట మా క్లబ్బుకు వచ్చి ఏడున్నర లగాయతు ఎనిమిదిన్నర దాకా రీడింగు రూములో గడిపినా సరే.

ఏడున్నర కల్లా మెంబర్లు చాలా వరకు పేకాట నుంచి విరమించి ఒక్కొక్కరుగా రీడింగు రూముకు జారుకుంటారు. సిద్ధహస్తులైనవారు ఏ అరడజను మందో చతుర్ముఖ పారాయణ సాగిస్తూ వుంటారు. మీరు వారి జోలికి పోవద్దు. కాలుజారి ఆ అగాథంలో పడిపోయినారంటే మిమ్మల్ని పైకి లాగటం నాబోటి అప్రయోజకుడి తరం కాదు.

మీరు రీడింగు రూములో అడుగు పెట్టగానే అందులో మీకు నాలుగైదు దుకాణాలు కనిపించవచ్చును. అప్పుడే పేపర్లు చదవటం పూర్తి చేసిన పెద్దలు

నలుగురైదుగురు ఒక పక్కనచేరి అంతర్జాతీయ సమితినీ[1] ముసోలినీ[2] హిట్లరునూ[3], గాంధీ[4], జవహర్లాలు[5] వగైరాలను తీవ్రంగా ఖండిస్తూ ఉంటారు. వారి వాగ్ధాటీ తీవ్రతా చూసి వారేమో అపాయకరమైన మనుష్యులని మీరు భావించగలరు. అటువంటిదేమీ లేదు. అంత సాధువులూ, అమాయకులూ, అజ్ఞానులూ ఉండబోరని తెలుసుకుని వారి దుకాణం విడిచి పెట్టెయ్యండి. మరొక దుకాణంలో సాహిత్యాలకూ, కళలకూ సంబంధించిన చర్చ జరుగుతూ వుంటుంది. చర్చ చేసేవారిలో ఒక్కొక్కరికీ ఒక్కొక్క అభిమాన కళో పాసకుడూ కవీ ఉంటారు కనుకనూ మీరు వచ్చిన పని వేరే ఉంది కనుకనూ మీరక్కడ కూడా నిలవవద్దు. అంతే కాదు; ఆరోజు కోర్టులో జరిగిన వింతలన్నీ జ్ఞాపకం తెచ్చుకునే ప్లీడర్ల దుకాణం దగ్గరకాని వేలకు ఆశిస్తున్న క్రాసువర్డు పజలు దుకాణం దగ్గరగానిమీరు ఆగనే వద్దు.

ఇక మీకు మిగిలి ఉండే దుకాణం మా బూతు పురాణపు దుకాణం మాత్రమే. అక్కడ మా ప్రకాశమూ శర్మా, మా ద్రాక్షాయీ (వాడికా పేరు ఎందుకు వచ్చిందో ఎట్లా వచ్చిందో ఇకీనాటికీ తెలియదు) మా బావమరిది శివానందమూ, నేనూ తప్పకుండా ఉంటాం.

ఈ దుకాణం యొక్క పుట్టు పూర్వోత్తరాలు సంగ్రహంగా చెబుతాను. మొదట్లో మాకెవ్వరికీ తెలియదు. బూతంటూ ఒకటి ఉందనీ, కొన్ని కొన్ని విషయాలు ప్రపంచంలో జరుగుతూ ఉంటవని మనకు తెలిసినట్టు ప్రపంచానికి తెలియనివ్వరాదనీ.

ఇట్లా వుండగా ఏ వార పత్రికలోనో బూతు కథలనూ వాటినీ గురించి ఒక వ్యాసం ప్రకటించబడ్డది. అదిచూసి మేము నలుగురైదుగురం చాలా చింతించాము. ఎందుకంటే స్త్రీ పురుష సంబంధమైన చర్చ చెయ్యటం తప్పని మా కదివరకు తెలియదాయె. మేమనుకుంటూ ఉండినదేమంటే సృష్టే - ప్రపంచమే- స్త్రీ పురుష సంబంధమైన మూలాధారంతో కూడుకున్నదని మేము కాలేజీలో చదివిన సెక్సు కాంప్లెక్సు తియరీలు మొదలైనవి ప్రపంచం యొక్క సృష్టి మాత్రమే కాక ఆ ప్రపంచం యొక్క అభివృద్ధి కూడా "బూతు" మీదనే ఆధారపడి ఉన్నదని నిరూపించినై. అటు పిమ్మట షా[6] వంటి రచయితలు ఏమన్నారంటే "మనిషి అయిన వాడు మతమూ, రాజకీయాలూ, సెక్సు (అనగా బూతు) వీటికి చెందిన సమస్యలను తప్పించుకొని తిరగరాదూ!" అని. ఇవన్నీ చేరి మమ్మల్ని చాలా వరకు నీతి బాహ్యులను 'చేసివేసినవని ఆ వారపత్రిక యొక్క వ్యాసం స్పష్టంగా తెలియజేసింది.

మేమంతా సిగ్గుతో తలలు వంచుకుని రహస్యంగా కంటి తడి జేబు రుమాళ్ళతో అద్దుకున్నాం.

మా ప్రకాశం గద్గదస్వరంతో "ఇక భార్యలమొహాలు ఎలాచూస్తాం?" అన్నాడు.

"ఈ గుడిపాటి వెంకటచలంవంటి వాళ్ళు లేకపోతే మనం ఇంతపాడు కామురా!" అన్నాడు శర్మ.

ఆ నాటికి అంతటితో అయిపోయింది.

మరుసటివారం మరొక వ్యాసం వచ్చింది. ఆ వ్యాసకర్త చాలా తెలివైన వాడంటాను. బాగా చదువుకున్నవాడు కూడాను. ఆయన పాత తెలుగు పుస్తకాలలో కూడా బూతులున్నవనీ, మనచేత గౌరవనీయులుగా ఎన్నబడుతున్న ఆ కవులకు కూడా స్త్రీ పురుష ప్రేమరహస్యం తెలుసుననీ వాదించాడు. మామొహాలు వికసించినై, మేము కొంచెం తెప్పరిల్లుకుని దీనంగా చిరునవ్వు నవ్వుతూ మళ్ళీ ఒకళ్ళ మొహాలు ఒకరు చూసుకున్నాం.

"అవున్రా, అబ్బాయిలూ!" అన్నాడు శర్మ కాస్త ఉత్సాహంతో, "ఈ పెద్దమనిషి చెప్పేమాట రైట్! ఎందుకంటే నేను మొన్న నాభార్యను క్షమాపణ వేడాను, ఇంతకాలమూ నేను ఆ పవిత్రమైన విషయంలో ఓలలాడినందుకు నా భార్య నవ్వి ఏమన్నదంటే, బూతులు మగవాళ్ళేం మాట్లాడతారండీ? మేం ఆడవాళ్ళం మాట్లాడుకుంటుంటే వినాలి!" అన్నది.

మళ్ళీ మేము మామూలు మనుష్యులం అయినాం. విఘ్నేశ్వరుడి బొడ్డులో వేలు పెట్టినవాళ్ళ సామెత మీకందరికీ తెలుసుగా? ఈ వారంరోజులనించీ మేమంతా అట్లా ఆ పెద్దమనుష్యులల్లే ప్రవర్తించినందుకు చాలా ఖిన్నుల మైనాము.

"ఆ మొదటివ్యాసం రాసినాయన ఉందే, ఆయన మునీశ్వరుడై ఉంటాడు!" అన్నాడు ద్రాక్షాయి.

"నీమొహం! యోగీశ్వరుడై ఉంటాడు!" అన్నాడు ప్రకాశం.

"కాదు మునీశ్వరుడే అయిఉంటాడు"

"మునీశ్వరుణ్ణి ఎక్కడన్నా చూశావు? నేను బోలెడుమంది యోగీశ్వరులను చూశాను"

ఇద్దరూ పోట్లాడుకున్నారు. నువ్వంటే నువ్వనుకున్నారు. మామూలు మనిషి మాత్రం కాదని ఇద్దరూ ఒప్పుకున్నారు. కనక మేమంతాచేరి ఎట్లాగో ద్రాక్షాయినీ ప్రకాశాన్నీ విడదీశాం.

ఆనాటినుంచి మా బూతు దుకాణం ఏర్పడ్డది. "బూతులను గురించి ఇంత శాస్త్రీయంగా చర్చించటానికి కూడా అవకాశం ఉందా!" అని మీరు తప్పక ఆశ్చర్యపడతారు, మా చర్చ ఒక్కనాడు విన్నారంటే.

నమూనాకు మొన్నటి శనివారంనాడు జరిగిన చర్చ సంగతి చెబుతాను.

గడియారం ఏడున్నర కొట్టబోతుండగా ప్రకాశం ఈమాట అన్నాడు.

"రంకుతనంలో ఉన్న తిరుగుడేమిటంటే, నన్నడిగితే రంకుతనం కూడా చాలా నీతిగా చెయ్యాలంటాను!"

గడియారం అరగంట కొట్టింది.

ఈమధ్య మా ప్రకాశంగాడు ఈ రిసెర్చి చాలా బాగా చేస్తున్నాడు. ఇందులోవాడు మమ్మల్నందర్నీ అతిక్రమించిపోయినాడని చెప్పవచ్చును.

శర్మ "హియర్! హియర్!" అన్నాడు.

ముసోలినీకి కనీసం గౌరవనరకమైనా ఇప్పించమని తన దుకాణంలో ఇతర మెంబర్లను ప్రాధేయపడి వేడుకుంటున్న పెద్దమనిషి అకస్మాత్తుగా చర్చ చాలించి ఇంటికి వెళ్ళాడు. మిగిలిన ముగ్గురు పెద్దమనుష్యులూ మావంక తీవ్రంగాచూసి వాళ్ళుకూడా ఇళ్ళకు వెళ్ళారు.

"అంటే?" అన్నాడు మా శివానందం చాలా తెలివిగా. మా శివానందం జంతువుల్లో గబ్బిలంవంతు. వాడు శర్మ అన్నట్టు "బూతూ" కాదూ "అబూతూ" కాదూ! వాడి వెధవ సంఘసంస్కరణకూ తత్సంబంధమై వాడు ఉపన్యాసాలివ్వటానికీ మా తీర్మానం పనికివస్తుందో లేదో చూసి మరీ తెలియచేసేవాడు తన అభిప్రాయాన్ని.

"అంటేనా? అంటే ఏముందీ? మన ద్రాక్షాయిని చూడూ!"

మా శివానందం చుట్టూ చూశాడు కాని ద్రాక్షాయి కనిపించలేదు. మా శివానందంగాడు ద్రాక్షాయికోసం చూడటం చాలా అనవసరం. ఎందుకంటే ద్రాక్షాయి ఆ పొలిమేరలో ఉంటే ప్రకాశం వాడి ఊసే ఎత్తి ఉండడు.

"ద్రాక్షాయి ఏంచేశాడూ?" అన్నాడు మావాడు ఆశ్చర్యంతో.

అందరమూ బిగ్గరగా నవ్వాం.

క్రాసువర్డు పజిలు దుకాణం చిన్న యుద్ధభూమి అయింది.

"అల్లర్నేటివులు నన్నడగకు. నేను నీకు చెప్పను."

"నువ్వే బావుకో పదిహేనువేలూ నువ్వెంత ఇదైన వాడివని నాకు మొదటి నించీ తెలుసు!"

"అనవసరంగా వెధవ ప్రసంగం చెయ్యకు."

"ఇదైన వాడినంటే వెధవ ననేనా అంతరంగిక అభిప్రాయం!"

"ద్రాక్షాయి ఏం చేస్తున్నాడో ఎరగని బైతువు నువ్వొక్కడివే కనిపించావు!" అన్నాను నేను మా బావ మరిదితో "చెప్పరా, ప్రకాశం!"

"విను" అన్నాడు ప్రకాశం. "కామయ్య నీకు ప్రాణస్నేహితుడు కద!"

"అవునూ!" అన్నాడు మావాడు. 'కాదూమరీ!' అనే అర్థం స్పష్టంగా స్ఫురించేటట్టు.

"ప్రపంచంలో ఇంతమంది ఆడవాళ్ళుంటే—"

"ఆఁ!"

"నీకు కామయ్య పెళ్ళామే దొరికిందా?" అన్నాడు ప్రకాశం గుర్లురిమి.

"నాకా! నాకా! నాకా!...." అనటం మొదలు పెట్టాడు మావాడు దేబె మొహం వేసి.

"నువ్వంటే నువ్వు కాదురా! ద్రాక్షామయిమాటే!"

మావాడు నిట్టూర్పు విడిచి "నేను నమ్మను!" అన్నాడు తనవంటి సంస్కర్త సజీవుడై వుండగా అంతపని జరగనేరదనే నమ్మకంతోనో ఏం కర్మమో.

"మేమంతా నమ్ముతూనే ఉన్నాం. తరవాత నీ యిష్టం! మా సంగతీ నీ సంగతీ ఏమిటి? ఈ రహస్యం!" ద్రాక్షాయికే తెలుసును. అయినా వాణ్ణి అడిగిచూడు!" అన్నాడు శర్మ.

మా శివానందం "నేనిప్పుడు నమ్మాను" అన్నట్టు తల పంకించి, కలియుగం తలుచుకుని భిన్నదౌతున్న వ్యాసమహర్షి పోజు పెట్టి, చివరకు "ఈ విషయమై ద్రాక్షాయికి బుద్ధి చెప్పవలసిన బాధ్యత నామీద ఉన్నదని నేను గుర్తిస్తున్నాను" అన్నాడు.

"క్షమించాలి!"

"అందరమూ అదిరిపడి వెనక్కు తిరిగి చూశాం. ద్రాక్షాయి ఎప్పుడో వచ్చి నా కుర్చీవెనకాలే నిలబడి ఉన్నాడు.

"ఏమిట్రా నా విషయం ఏదో ముచ్చటిస్తున్నట్టున్నారు!" అన్నాడు ద్రాక్షాయి.

మా శివానందాన్ని సరిగా ఎరగనివాళ్ళు ఇటువంటిది జరిగినప్పుడు మావాడికి నోటిమాట రాకుండా పోతుందనుకుంటారు. కాని అట్లా ఎన్నటికీ కాదు. మావాడి ధైర్యం చూసి నాకు చాలా ఆశ్చర్యం వేస్తుంది. వాడు ఒక్కరవైనా వెనకతియ్యక ఇటువంటి సంఘటనను ఎదుర్కొంటాడు. గిట్టనివాళ్ళు వాడియొక్క ఈ ధైర్యాన్ని మౌర్ఖ్యమని కూడా అనటం కద్దు.

"మరేం లేదు. నీ ప్రయోజకత్వాన్ని గురించి మాట్లాడుతున్నాం. సమయానికి వచ్చావు. కూర్చో!"

"ఇప్పుడేమయిందీ?"

"ఇంకేం కావాలీ? నీకూ కామయ్య భార్యకూ గ్రంథం నడుస్తున్నదిటే?"

"ఎవరన్నారూ?"

"ఇడుగో! ఈ ప్రకాశం గాడు!.... ఏడీవీడూ?"

"ఇప్పుడే ఒక్క నిమిషం కింద వసుందని ఇంటికి బయలుదేరాడులే చెప్పు! చెప్పు! అంటూ ద్రాక్షాయి ప్రకాశం ఖాళీచేసిన కుర్చీలో కూర్చున్నాడు.

"ఇదేం బాగాలేదురా ద్రాక్షాయి! నాతల తీసేసినట్టుంది!"

"అది అసలు అక్కడ ఎప్పుడూ లేదులే!.... అయితే ఏమిటి నీ అభ్యంతరం?"

ఏది ఎక్కడ ఎప్పుడూ లేదో మావాడికి అర్థం కాలేదు కాని వాడా విషయం ఆటే ఆలోచించక అసలు విషయానికి వచ్చాడు.

"కామయ్య ఒకప్పుడు నీకు మంచి స్నేహితుడు కద!"

"ఇప్పుడు మాత్రం?"

"ఇంకేం! అటువంటప్పుడు నువు చాటుగా వాడి పెళ్ళాంతో సాహసం చేస్తూ పైకి వాడితో స్నేహితంగా ఉండటం కన్న ఘోరం ఉందా? నీ గుట్టు వాడికి తెలిస్తే?"

"వాడికి మొదటినుంచీ తెలుసునే!" అన్నాడు ద్రాక్షాయి మావాడి అజ్ఞానానికి ఆశ్చర్యపోతూ.

శివానందం మొహం చూసి తీరాలి.

అవకాశం చూసుకుని ద్రాక్షాయి చిన్న ఉపన్యాసం దంచేశాడు.

"ట్రూలవ్ అనగా నిజమైన ప్రేమతత్వం నీకేం తెలుస్తుందిరా? ఉత్త సంఘసంస్కర్త మాత్రుడివీ! నీకు అదది కేవలం భోగ్యపదార్థం. నిజమైన ప్రేమ అనేటు వంటిది నేను అనుభవించాను. నీ వెధవ సెంటిమెంట్సు నా ప్రేమను అంటనేరవు!"

అన్నీ అబద్ధాలు. కామయ్య పెళ్ళాం మొదటినించీ పట్టి అవినీతి పేరురాలు, తిరుగుబోతు. కామయ్య ఆమెను ఎప్పుడో విడిచి తిరుగుతున్నాడు. ద్రాక్షాయివి కోతలని మావాడు ఎరగకపోయినా వాడి మాటలకు మా శివానందం సంచలించలేదు.

"అంత ప్రేమ కలవాడివి కాస్త ఇంద్రియనిగ్రహం తెచ్చుకోలేక పోయినావా?" అన్నాడు మావాడు.

"ఇంద్రియ నిగ్రహమా!" అన్నాడు ద్రాక్షాయి ఈ జన్మలో అటువంటి మాట వినినివాడల్లే.

"నీ వెధవ ఇంద్రియ నిగ్రహం ఎవడిక్కావాలిరా? నా ప్రేమ దానికి అతీతమే!.... అన్నట్టు ఇంద్రియ నిగ్రహమంటే జ్ఞాపకం కూడా వచ్చింది! అర్జంటు అపాయింటుమెంటు! వెళ్ళాలి" అంటూ ద్రాక్షాయి లేచి పోయినాడు.

ఆ తరవాత కాస్సేపు ఎవ్వరమూ నోరు మెదపలేదు. చివరకు మా శివానందమే నోరు చేసుకుని, "రంకుతనమనేది పూర్తిగా నిర్మూలనం చెయ్యటం ఎవడి తరమూ కాదు. అయితే ఆ పని అవసరాన్నిబట్టి చెయ్యాలి, అదే అందులో ఉన్న తిరుగుడు!' అన్నాడు. (మావాడి సంఘసంస్కరణ సాధ్యమైనంత వరకు వాటికి తగలకుండా పోతూంటుంది లెండి!)

"సరేలే!" అన్నాడు శర్మ. "ఇంతకు మునుపే ఒకడు రంకుతనం నీతిగా చెయ్యమని చెప్పి వెళ్ళాడు. అదే అర్థంకాక చస్తుంటే నువు మరొక ఘట్ట శ్లోకం చదువుతున్నావేమిటి?"

"శివానందంగారు చెప్పినదాన్లో కొంత నిజం లేకపోలేదు!" అని వెంకట నారాయణ అందుకున్నాడు.

"ఎందుకంటే మా మేనమామ కొడుకు ఒకాయన ఉన్నాడు. ఆయనకు స్త్రీ వ్యసనం జాస్తి. అనకూడదు కాని పాకీముండ కూడా - తెలియలా? మొదట మొదట ఆయన భార్యకు ఈ విషయమై చాలా మనః ఖేదంగా ఉండేది. అయితే కాలం గడిచిన కొద్దీ, తెలివికలది గనుక, ఆవిడ ఒక్క విషయం గ్రహించింది. తక్కువ జాతి స్త్రీలను చూచిన కళ్ళతో తన్ను చూసి తన భర్త తనమీద ఎంతో ప్రేమగా ఉండటమూ, తన్ను చూసి భర్త భయభక్తులతో మెలగటమూ ఆమె గమనించింది. ఇప్పుడిప్పుడు ఆమె తన భర్త ఎంత తక్కువ స్త్రీల వెంటపడితే అంత సంతోషిస్తుంది. ఆయన పతితుడైన కొద్దీ ఆమె ఔన్నత్యం జాస్తి అవుతుంది."

మావాడికి ఉదాహరణ నచ్చలేదు. వాడు ఏమనటానికీ తోచక ఆలో చిస్తుండగా శర్మ "కొంతమంది తల్లులు ఇతరుల పిల్లలను చూసి అసహ్యించు కోకుండా తమ పిల్లలను ప్రేమించలేరు. అట్లా ఉంది మీ ఉదాహరణ. రాట్! మేం వప్పం!" అన్నాడు. "ఏంరా, శివానందం?"

శివానందం గొప్పవాడల్లే ఒక నవ్వు నవ్వి. "నా మటుకు నేను ఇంద్రియ నిగ్రహం పరమావధిగా పెట్టుకుంటాను. అటువంటి నిగ్రహం అపాయకర మైనప్పుడు రంకుతనం చెయ్యవచ్చును. అదే అవసరాన్ని బట్టి రంకుతనం చెయ్యటం అంటే." అని తీర్పు చెప్పాడు.

"ఇంద్రియ నిగ్రహం ఒకప్పుడు అనవసరం కాని అపాయకరం కాని అవుతుందా ఏమిటి?" అన్నాడు వెంకటనారాయణ.

"ఆ! భోజనం ముందు కూర్చున్న క్షుత్పీడితుడికి నోరు కట్టివేసుకోవటం అవసరమూ అపాయకరమునూ!" అన్నాడు మావాడు.

"భోజనం చెయ్యటం తప్పుపని కాదే! మనం తప్పు పనిని గురించి మాట్లాడుతున్నాం" అన్నాడు వెంకట నారాయణ.

"డాం నాన్సెన్స్! అట్లావస్తే ఏదీ తప్పవని కాదు. మగవాడు ఆడదాన్ని వాంఛించటం తప్పవనా? అనవసరంగా భోంచెయ్యటమూ తప్పే.... నువ్వే రైటురా, బ్రదర్!" అన్నాడు శర్మ.

మావాడి ఆనందం చూసితీరాలి.

"అయితే" అన్నాడు శర్మ ఒకచిన్న ఎమెండ్మెంటు పెడుతూ, "శివానందం ఒక్కచోట పప్పులో కాలు వేశాడు. రంకుతనం చెయ్యకుండా ఉండటానికి ఇంద్రియ నిగ్రహం కావాలని వాడు దురభిప్రాయ పడుతున్నాడు. నా మనవి ఏమిటంటే రంకు చెయ్యటానికే ఇంద్రియ నిగ్రహం కావాలని?"

ఆ దెబ్బతో అందరమూ నిర్ఘాంతపోయినాం

అందరికీ అనుభవమే కాని ఎవరూ నమ్మరు. నేను ఎగ్గూ సిగ్గూ గయలో వదిలి పెట్టినవాణ్ణి కనకనూ, ఇక్కడ పరాయివాళ్ళెవరూ లేరు కనుకనూ నా అనుభవమే ఒకటి చెబుతాను చిత్తగించండి" అని శర్మ ఈ విధంగా చెప్పుకుని వచ్చాడు.

నా భార్య అన్నివిధాలా ఆదర్శప్రాయురాలైన మనిషి కాని సరదా తక్కువ మనిషి.

అసలే మాది పెద్ద కుటుంబం. కావాలన్నప్పుడల్లా నేను నా భార్యా ఇంత దగ్గరగా కూర్చుని సరదాగా మాట్లాడుకోవటానికి లేదు. ఎప్పుడైనా అవకాశం చేసుకుందామని నా భార్య ప్రయత్నమైనా చెయ్యదు.

పోనిమ్మనుకుందును. ఈ వెధవ అల్పసుఖానికి నలుగురు తమ్ముళ్ళనూ, ముగ్గురు చెల్లెళ్ళనూ, మేము తప్ప దిక్కులేని మా మేనత్తనూ ఆమె కొడుకునూ ఎక్కడికి తరమను? ఇంతమందీ చూసేటట్టు భార్యా పనిమానుకుని వచ్చి నాతో ఒక్కక్షణం సరసాలాడక పోతేనేం? అందరికన్నా పెద్దవాణ్ణిగా పుట్టటం నాదే తప్పు.

రాత్రి పదిగంటలు కాగానే మమ్మల్నిద్దర్నీ, పశువులను బందిలి దొడ్లోకి తోలినట్టు, పడకగదిలోకి తరుముతారు. అదే పదివేలనుకునేవాణ్ణే కాని మరొకటి కాదు. కాని అట్లాగైనా కాలం వెళ్లుతుందా? ఎందుకు వెళ్లుతుందీ?

నా పాడు కళ్ళకు తను మామూలు కంటే కూడా ఎక్కువ అందంగా కూడా కనపడి నేను తనకోసం తపించే రోజుగా చూసి మా ఆవిడ చుట్టపు చూపుగా వచ్చిన ఏ అసందర్భపు మారుమూల చుట్టాన్నో ఆనాడు ఉండిపొమ్మని నిర్బంధిస్తుంది. ఆ రాత్రి ఆ మనిషిని మా ఇంట్లోనే పడుకోమంటుంది. తను మాత్రం పడుకోటానికి పైకిరాదు.

ఇదేమిటంటే, "చాల్లెండి. ఎవరో ఇంటికి వచ్చిన రోజునే నేనువచ్చి

గదిలో దూరాలా ఏమిటి? నాకు సిగ్గమ్మా! ఒక్కరోజుకు ప్రాణం పోతుందా ఏమిటీ?" అంటుంది.

మనిషనే మృగం ఉంది చూశారూ? అది ఏ పరిస్థితులకైనా అలవాటు పడిపోతుంది. వారానికి నాలుగైదు రోజులు బ్రహ్మచర్యం చెయ్యటానికి కూడా ప్రాణం అలవాటయింది. నా భార్యతో నేను అఘోరిస్తున్నది కాపరమా రంకుతనమా అని కూడా నాకు మధ్య మధ్య అనుమానం కలిగేది.

కాలం ఇట్లా వెళ్ళిపోతుందేమో ననుకున్నాను. ఎందుకు వెళ్ళుతుందీ?

ఒకనాడు పల్లెటూరు నించి మా పెత్తండ్రి భార్యా (వితంతువు) వచ్చింది. ఆమె వెంట ఇద్దరు మనుమలూ ముగ్గురు మనమరాళ్ళూ వచ్చారు– ఆమెను విడిచి ఉండరట. ఆమె పిల్లలకోడి మాదిరిగా వచ్చి మా కొంపలో వాలింది. ఒక పిల్లకు కళ్ళజబ్బుట. పిల్లను వైద్యుడికి చూపించి మందు తీసుకుని వెళ్ళిపోతానని చెప్పింది ఆమె, నేను నిజమే ననుకున్నాను.

కాలవ్యవధి కాకుండా నేనే ఈ బలగాన్ని డాక్టరుగారింటికి పట్టుకెళ్ళాను. డాక్టరు పిల్లను ఊళ్ళో ఉంచాలన్నాడు. మా పెత్తండ్రి భార్య నన్ను తమ కొరకు ఇల్లొకటి మాట్లాడమన్నది ఇంటికివస్తూ నేను సరేనన్నాను. తీరా మేము ఇంటికి వచ్చేటప్పటికి నా భార్యా అంతా తలకిందులు చేసింది.

"మీరు వేరే ఇంట్లో ఉండటమేమిటండీ, అత్తగారూ? ఈ నెల్లాళ్ళూ మా యింటిలోనే ఉండి పిల్లలకు కళ్ళు నయం చేసుకుని మరీ వెళ్ళండి" అని భార్య ఆమెను సరేననే దాకా ప్రార్థించింది.

నా గుండెల్లో రాయిపడ్డది.

మా అమ్మ అయినా కోడల్ని కోప్పడకూడదూ, ఏమిటి నీకీ దుర్బుద్ధి అని? ఊఁహూఁ! ఆమెకు నా భార్య అయినవాళ్ళనూ కానివాళ్ళనూ మర్యాద చెయ్యటం బహు ఇష్టం. ఆమె స్వయంగా ఉండమంటే ఎవ్వరూ ఉండరు, అదేం కర్మమో!

"ఆహా! నీ కోడలెంత మర్యాద తెలిసిన మనిషే. సుబ్బీ! నీ కిటువంటి కోడలు దొరకటం ఎంత అదృష్టమే! మా కోడలా? హయ్యోరాత!" అని ఎవరైనా అంటే మా అమ్మకు పరమానందం.

మూడురోజుల పాటు నా భార్యకిందే పడుకోవటం చూసి "ఏమిటది?" అన్నాను. "తొందరపడకండి!" అంది నా భార్య, నాకు ఆశ పుట్టింది. ఇంకో నాలుగు రోజులు చూసి "ఏమిటి మరి?" అన్నాను.

నా భార్య దేబె మొహం వేసి "ఏం చెయ్యనండీ! పోనీ ఆవిడ నన్ను 'నీ మొగుడి దగ్గిరికి వెళ్ళి పడుకో!' అనైనా అనదు!" అన్నది.

"నీ కిష్టం ఉంటే ఆవిడ అనుజ్ఞ కావాలా ఏమిటి" నువ్వే కావాలని ఇట్లా చేస్తున్నావు. మగవాళ్ళను దక్కించుకోవటం చాతకాక పోవటం ఇదేగా!"

అన్నాను. ఆ చివరమాటకైనా భయపడి నా భార్య తన చాదస్తం విడిచిపెట్టు తుందని లోపల ఆశ.

చూశారో లేదో ఆశ అనేది ఒకటి కలిగిన తరువాత అది తీరాలన్నా తీరాలి లేక నిరాశ అయినా కావాలి. ఆశ అడుగు పెట్టినచోట అమిత ఆనందమో అమిత కష్టమో కలిగి తీరాలి. నేనా బెదిరింపు బెదిరించిన తరావాత ఏమీ జరగ నట్టు మామూలు ధోరణిలో ఉండటం అసంభవం.

మళ్ళీ మూడురోజులు చూశాను. నా భార్యపైకి రాలేదు. నాకు ఏదైనా కొంటెపనిచేసి తీరాలనిపించింది. లేకపోతే నా మర్యాదకే హాని! ఆ చివర మాటలు అనకుండా ఉంటే ఎంత బాగుండేది.

ఒకనాడు గట్టిగా తీర్మానించుకుని భోగం కొంపలవైపు పోదామని బయలు దేరాను కాని వెళ్ళలేదు. ఎందుకని అడగండి! సగం దారిలో నా కాళ్ళు సమ్మె కట్టినై.

ఎవత్తె అయినా ఆడది పనిపెట్టుకుని నన్ను చెడగొట్ట వలిసిందే కాని నా అంత నేను చెడిపోవటానికి అవసరమైన ఇంద్రియ నిగ్రహం నా దగ్గిర లేదని గ్రహించాను.

తరవాత రెండు మూడు రోజులకే నన్ను చెడగొట్టటానికి తీర్మానించు కున్న ఆడది కూడా తటస్థ పడ్డది. మా యింటికి ఎదురుగా ఉన్న ఖాళీ ఇంట్లో ఒక దంపతులు ప్రవేశించారు. ఇద్దరూ చిన్నవాళ్ళే. భార్య అటే అందగత్తె కాదు కాని చిన్నది. పదహారు పదిహేడేళ్ళకంటె ఉండవు. ఆ పిల్ల ఆ ఇంట్లో అడుగుపెట్టిన రోజునే నామీద కన్ను వేసింది, రోజుకు పందసార్లు వరండాలోకి వచ్చి నా గదివైపు చూసేది. ఆ రోజు కారోజు ఆ పిల్లకు నా మీద వాంఛ చాలా ఎక్కువవుతున్నట్లు కనపడ్డది. నా కళ్ళకూ చెవులకూ ఆనందం కలిగించే ప్రయత్నాలు ఆమె చేసేది ఊహించుకోండి!

ఆ పిల్లకు నామీద ఉన్న వాంఛలో నా భార్యకు పదోవంతు ఉండరాదూ? ఎందుకుంటుందీ?

"ఈ సారి ఆ పిల్ల వరండాలో కనిపించినప్పుడు నవ్వుదాం. వీలుచేసు కుని ఆ పిల్లను వీధి గుమ్మంలో ఉండగా ఒకసారి పలకరిద్దాం. ఇట్లా ఇట్లా మాట్లాడుదాం" అని ఎన్నో ఆలోచనలు చేసేవాణ్ణి. నవ్వటానికే నా అవయవాలు స్వాధీనం కాలేదంటే మిగతా వాటి విషయం చెప్పాలా?

నా భార్యను గురించి ఆలోచించటమే మానేశాను. ఆ పిల్లే నా భార్య అన్నంత అభిమానం నాకు కలిగింది. ఆ పిల్ల భర్త ఎప్పుడూ ఇంట్లో ఉండడు. చాలా రోజులు ఊళ్ళోనే ఉండడు. ఇక మా ఇద్దరికీ సాహసం కలగటానికి అభ్యంతరం ఏమిటీ? నాకు ఇంద్రియ నిగ్రహం లేకపోవటమే.

నాకు అవకాశాలు కూడా బోలెడన్ని వచ్చినై. ఆ పిల్ల తల వాకిట్లో అరగంటసేపు నిలబడేది. ఈ లోపల నేను కాగితం ముక్కమీద నాలుగు ముక్కలు గీకి చల్లగా బయటికివెళ్ళి మా పాడు బడ్డ సందు నిర్మానుష్యంగా ఉన్న క్షణం చూసి ఆమెకు ఆ కాగితం ముక్క అందివ్వవచ్చును అది చెయ్య లేదు.

మొదట్లో "ఆ పిల్లకు మన మీద ఇష్టం ఉన్నదని ఇంకా ఘట్టిగా నిర్ధారణ అయిన మీదట - అప్పుడు మనం పులే!" అని నాతో నేనే కోశాను.

ఆ తరవాత ఆ పిల్ల ఒక్కసారి నన్ను చెయిఊపి పిలిస్తే ఎంతకయినా సంసిద్ధుణే ననుకున్నాను. నమ్మండి నమ్మకపోండి ఆ పిల్ల దాదాపు అంతపని కూడా చేసింది.

చివరకు "దాందుంపతెగా! ఆ అమ్మాయే ఏ అర్థరాత్రివేళో మా తలుపు తెరుచుకుని నేరుగా పైకి వచ్చెయ్య కూడదూ!" అనిపించింది కాని అది ఎంత అన్యాయమో నాకే తెలుసును. ఎందుకంటే మా ఇల్లు పది మందితో నిండిన కొంప. వారిల్లు దాదాపు ఎప్పుడూ నిర్మానుష్యమే. అదికాక ఆ పిల్ల తన పార్టు బాగా చేస్తున్నది. నేనే దద్దమ్మనైనాను.

ఒక్కరాత్రి నేను కునికితే ఒట్టు. ఎప్పుడైనా రాత్రివేళ బయటికి వస్తుందేమో తెగబడి వెళ్ళి పలకరింతామని.

ఇంతకూ ఆ పిల్ల నేనెంత వెధవనో నిరూపించదలుచుకున్నదానల్లే కనపడ్డది. ఒకరోజు రాత్రి ఒంటిగంటవేళ తలుపు తెరుచుకుని వరండా మెట్లు దిగి పండు వెన్నెలలో నిలబడ్డది. నా కిటికీ వంకే చూస్తున్నది. నేను కదలలేదు. నా కాళ్ళు మళ్ళీ సమ్మె కట్టినై. ఆనాడు ఆమెబర్త ఊళ్ళో లేడు. నాకు తెలుసును. ఏం లాభం?

అట్లా పదినిమిషాలు గడిచి ఉంటుంది. ఆ పిల్ల చివరకు విసిగి లోపలికి వెళ్ళిపోయింది.

అప్పుడు నాకు పశ్చాత్తాపం కలిగింది. ఈసారి ఇటువంటి అవకాశం పోగొట్టుకోరాదని తీర్మానించుకుని పడుకుని నిద్రపోయినాను.

మళ్ళీ రెండురోజుల తరవాత ఆ పిల్ల అట్లాగే ఒంటిగంటప్పుడు బయటికి వచ్చింది. ఈసారి తలుపు గడియతీసి వెళ్ళి వరండా మెట్లమీద కూర్చున్నది.

ఇంతకన్న నాకు అవకాశం ఎట్లా వస్తుంది? నేను నిలువుగా కంపిస్తూ నా ఇంద్రియాలన్నిటినీ చిక్కబట్టి కదిలాను. మేడమెట్లు పక్షవాతంతో బాధ పడుతున్నవాడల్లే దిగటం మొదలుపెట్టాను. అది ఉత్సాహంగా పోపటం కాదు చూడండి. వధ్యశాలకు బలవంతంగా వెళ్ళే పశువులు.

తీరా మేడమెట్లు సగం దిగేటప్పటికి ఒక ఆలోచన వచ్చింది.

"ఇదంతా ఎందుకు వచ్చింది. రేపో ఎల్లుండో ఆ పిల్లలకోడి వాళ్ళ ఊరికి వెళ్ళిపోతుంది. ఆ తరవాత నేనూ నా భార్యా సుఖంగా ఉండవచ్చు."

సరే ఇంకేం గబగబా మెట్లెక్కిపోయి పడుకున్నాను. కనక, నాయనలారా!

శర్మ కథ పూర్తిచేశాడు. (అది నిజంగా కల్పనాకథే అని నేను మీకు వేరే చెప్పక్కర్లేదు. శర్మ దొంగ కాని వాడి కథకున్న నీతి దానికుంది.)

ఇంతకూ మా శివానందం ఓడిపోయినట్టు ఒప్పలేదు.

"నీ అనుభవాన్ని బట్టి లోకాన్నంతా ఊహించకూ. ఇప్పటికీ నా వాదన ఏమిటంటే రంకు చెయ్యటానికన్న ఎక్కువ చెయ్యకుండా ఉండటానికి ఇంద్రియ నిగ్రహం కావాలని."

ఇక నేను కలగచేసుకోక తప్పింది కాదు.

"ఒరే, శర్మా! ఒకసారి మా శివానందమే ఏంచేశాడనుకున్నావు?–" అని ప్రారంభించానూ.

"చెప్పు! చెప్పు!" అన్నారంతా.

మావాడు మొహం కండలూడ పెరుక్కుంటూ లేచి "ఇంత సిగ్గుమాలిన వెధవల్ని నేనెక్కడా చూడలేదు" అంటూ చరచరా బయటికి వెళ్ళిపోయినాడు.

"ఏం చేశాడురా మీ శివానందం?" అన్నాడు శర్మ.

నాకు నిజంగా ఏమీ తెలియదు.

"ఏదో చెయ్యకుండా ఉండి ఉంటాడా అని అట్లా అన్నాను!" అని సమాధానం చెప్పాను.

(ప్రథమ ముద్రణ : అక్టోబరు 1936, భారతి)